# రంగుల కల

"ఏమంటావురా?"

"నాకు ఆ అమ్మాయి నచ్చలేదన్నాను - అంతే! ఇక నన్ను విసిగించకండి."

"పిల్ల చక్కగా ఉంది. చదువుకొంది. మంచి కుటుంబం - ఆస్తి పాస్తులున్నాయి. ఇందులో నీకు నచ్చనిదేముంది బాబూ!"

రాజేశ్ (రాజేశ్వర్రావు) ససేమీరా ఒప్పుకోలేదు. ఎన్ని సంబంధాలు చూసినా ఏదో వంక పెడుతూనే ఉన్నాడు. ఒక పిల్లను 'లావు' అన్నాడు. ఇంకో అమ్మాయిని 'మరీ సన్నం - ఎముకల పోగు' అన్నాడు. మూడో అమ్మాయి 'కళ్ళు మరీ చిన్నవ'ట. నాలుగో సంబంధంలో అమ్మాయి 'రాక్షసి బొగ్గులాంటి నలుప'ట.

"ఇలా వంకలు పెట్టావంటే చివరికి నీకు పెళ్ళికావడమే కష్టమై పోతుంది" అని విసుక్కున్నాడు తండ్రి.

"ఏమైనా ఇది నా జీవితానికి సంబంధించిన విషయం. నా ఆశయాలకు తగిన అమ్మాయి దొరికే వరకూ నేను పెళ్ళి చేసుకోను."

"ఆశయాలట - ఆశయాలు! వీడు పెద్ద నలకూబరుడు కాబోలు! జులపాలూ వీడూను" అని తండ్రిగారు గొణుక్కుంటూ వెళ్ళిపోయారు.

"నువ్వేమైనా చెప్పమ్మా! నా భార్య కాదగిన పిల్లకు ఏ లోపం ఉండటానికి వీల్లేదు. నిద్దట్లో నుంచి లేపి నిల్చోబెడితే 'బ్యూటీ క్వీన్'గా పోటీ లేకుండా సెలెక్ట్ కావాలి."

"ఏమిటోరా నీ వెర్రి! ఇప్పుడు మనమనుకుంటున్న పిల్లకు ఏం లోటు?"

"కళ్ళజోడమ్మా - కళ్ళజోడు! భూతద్దాలలాంటి అద్దాలు. ఇప్పుడే ఇలా ఉంది. ఇంక కొన్నాళ్ళకు పూర్తిగా గుడ్డిదయితే...."

"ఛా - అవేం మాటలురా! కళ్ళజోడున్న వాళ్ళందరూ గుడ్డివాళ్ళేనేమిటి? మీ నాన్నగారికి లేవా, నాకు లేవా - కళ్ళద్దాలు?"

"మీ సంగతి వేరు. వయసు మళ్ళాక ఎవరైనా పెట్టుకోవలసి వస్తుంది."

మొత్తానికి ఆ సంబంధమూ తిరగ్గొట్టాడు రాజేశ్.

చివరకు అతను మెచ్చిన సంబంధాన్నే చేశారు తల్లిదండ్రులు.

ఆ అమ్మాయి రాజేశ్ కలలకు తగినట్లుగా అందంగా, అజంతా బొమ్మలా ఉంది. ధనవంతుల గారాలపట్టి. అల్ట్రా మోడరన్‌గా ఉంది. పెళ్ళయిన మూడో రోజే హనీమూన్‌కు బయలుదేరారు దంపతులు.

బెంగుళూరులో ఖరీదైన హోటల్లోదిగారు. స్నానం, భోజనం, కబుర్లు అయ్యాక, "చాలా రాత్రయింది" అన్నాడు రాజేశ్.

"మీరు పడుకోండి. నేను డ్రెస్ ఛేంజి చేసుకు వస్తాను" అంటూ తను డ్రెస్సింగ్ టేబిల్ దగ్గరకు వెళ్ళింది.

రాజేశ్ బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని పడుకున్నాడు. ఐదు నిముషాలకు నవ వధువు వస్తున్న అడుగుల చప్పుడు!

కళ్ళు తెరచి చూసాడు. గులాబీ రంగు నైటు గౌనులో ఒంపుల వయ్యారి... అరె! అదేమిటి? ఆ కళ్ళజోడు?

"నీకు కళ్ళజోడుందా?" అన్నాడు ఎలాగో గొంతుక పెగల్చుకొని.

"అఫ్‌కోర్సు! అది లేకపోతే రెండు గజాల దూరంలో వస్తువులు కూడా స్పష్టంగా కనిపించవు నాకు."

"మరి ... పగలంతా?..."

"కాంటాక్ట్ లెన్స్ వాడుతాను. రాత్రిళ్ళు అవి తీయక తప్పదుగా మరి?" మెల్లగా అంది.

రాజేశ్ అలాగే గుడ్లప్పగించి చూస్తున్నాడు.

ఆమె ఫక్కున నవ్వి పెద్ద లైట్ ఆర్పి బెడ్‌లైట్ వేసింది. నీలిరంగు రూమంతా పరచుకుంది.

(మార్చి 1980)